EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
09-08-2025
పేజీలు: 02





## హ్యాపీ రక్షా బంధన్



# సు ఫ్రమ్ సో రివ్యూ




రీసెంట్ గా కన్నడలో మంచి విజయం సాధించిన చిత్రమే 'సు ఫ్రమ్ సో'. రాజ్ బి శెట్టి నిర్మాతగా తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పుడు తెలుగులో డబ్బింగ్ అయ్యి విడుదలకి వచ్చింది. మరి కన్నడ నేలపై మంచి విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ఆడియెన్స్ ని ఏ మేరకు ఆకట్టుకుందో ఇప్పుడు రివ్యూలో చూద్దాం రండి. మర్లూర్ అనే చిన్న గ్రామంలో అశోక్ (జేపీ తుమినాడ్) కి సులోచన అనే దెయ్యం పట్టింది అని ఆ గ్రామస్తులు నమ్మడం మొదలు పెడతారు. దీనితో తన కుటుంబం సహా ఆ గ్రామం మొత్తం సులోచన దెబ్బకు భయం పట్టుకుంటారు. దీనితో ఈ సమస్య నుంచి బయట పడెయ్యడానికి రంగంలోకి రవన్న (శనీల్ గౌతమ్) దిగుతాడు. అక్కడ నుంచి కథ ఎలా మలుపు తిరిగింది. తమకి దగ్గర్లోనే ఉన్న సోమేశ్వర గ్రామానికి ఉన్న లింక్ ఏంటి? చివరికి ఆ దయ్యం వదిలిందా లేదా? ఆ దయ్యం ఎవరు? గ్రామస్తులు బయట పడ్డారా లేదా అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. ఈ చిత్రం తాలూకా ట్రైలర్ చూసినప్పడే చాలా సహజత్వం కనిపిస్తుంది. ఒక కన్నడ సినిమాలా కాకుండా చాలా రియలిస్టిక్ గా కనిపించే మళయాళ సినిమా షేడ్ లో అనిపిస్తుంది. మరి ఇంట్రెస్టింగ్ గా ఈ సినిమా మొత్తం కూడా ఇదే తరహాలో మంచి క్లీన్ విజువల్స్ తో సహజమైన నరేషన్ తో సాగడం అనేది ఈ తరహా సినిమాలు ఇష్టపడేవారిని మొదటిగా ఎంగేజ్ చేస్తుంది. అలాగే ఒక చిన్న సెటప్ చేసుకున్న గ్రామంలో అక్కడి మనుషులు వారి నడుమ జెనరేట్ అయ్యే కామెడీ మంచి ఫన్ గా అనిపిస్తుంది. ముఖ్యంగా సెకండాఫ్ లో ఈ అంశాలు బాగున్నాయి. రవన్న పాత్రలో శనీల్ గౌతమ్ అదరగొట్టారు. నీట్ పెర్ఫామెన్స్ తో ఎక్కడ ఎంతలా చెయ్యాలో చాలా బాగా చేసి చూపించారు. అలాగే లీడ్ రోల్ అశోక్ ది అయినప్పటికీ రవన్న రోల్ కి స్కోప్ అందులో తాను నటించిన విధానం మరింత మెప్పిస్తుంది. అలాగే జేపీ తుమినాడ్ తన రోల్ కి మరీ అంత స్పేస్ లేదు కానీ ఉన్నంతలో బాగా చేశారు. కానీ క్లైమాక్స్ పోర్షన్ లో మాత్రం తన రోల్ మరింత ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. ఇక వీరితో పాటుగా ఇతర నటీనటులు బాగా చేశారు. చిన్న పాత్రలో కనిపించిన రాజ్ బి శెట్టి తన పాత్రలో అలరించారు. కన్నడలో అంత పెద్ద హిట్ అయ్యిన ఈ సినిమాలో మరీ అంత గొప్ప లైన్ కనిపించలేదు. చాలా సింపుల్ విలేజ్ హారర్ కామెడీ లైన్ తీసుకోగా దానిని పెద్దగా ట్విస్ట్ లు టర్న్ లు లాంటివి లేకుండానే సెట్ చేసుకున్నారు. దీనితో ఒకింత ఎక్కువ ఆశించినవారు డిజప్పాయింట్ కావచ్చు. అలాగే సినిమాలో కామెడీ బాగానే ఉంది కానీ తెలుగు ఆడియెన్స్ మరీ ఎక్కువగా కనెక్ట్ అయ్యే ఛాన్స్ లేదు. అలాగే ఈ తరహా విలేజ్ కామెడీ డ్రామాలు మనం ఇది వరకే చూసాం కాబట్టి ఇది చాలా సింపుల్ గానే అనిపిస్తుంది. ఇక వీటితో పాటుగా మరో సమస్య ఏంటంటే సింపుల్ లైన్ నే తీసుకున్న దర్శకుడు దానిని అదే తరహాలో సోసో గానే నడిపించేసారు. కథనం ఊహాజనితంగానే సాగుతుంది. వీటితో పాటుగా హారర్ ఎలిమెంట్స్ కూడా అంత థ్రిల్ కలిగించేలా లేవు. ఇలాంటి వాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సింది. అలాగే దర్శకుడు చెప్పాలనుకున్న సందేశం ఇంకా బలంగా ఎస్టాబ్లిష్ చేసుకుంటే బాగుండేది. ఇక వీటితో పాటుగా అశోక్ రోల్ ఒక సమయం తర్వాత సైడ్ అయ్యిపోయినట్టు అనిపిస్తుంది. మొత్తం రవన్న సైడ్ తీసుకుంది. ఇక్కడ కూడా మిస్ ఫైర్ జరిగింది. ఇంకా అనేక పాత్రలు అలా వస్తూనే ఉంటాయి. కథనంలో ఇన్ని పాత్రలు అనవసరం. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు మాత్రం చాలా బాగున్నాయని చెప్పాలి. మంచి విలేజ్ సెటప్ ని చేసుకున్నారు. ఇందుకు తగ్గట్టుగానే మంచి కెమెరా వర్క్ ఎస్ చంద్రశేఖరన్ అందించారు. అలాగే సందీప్ తులసీదాస్ సంగీతం బాగుంది. నితిన్ శెట్టి ఎడిటింగ్ ఇంకా బెటర్ గా చేయాల్సింది. ఫస్టాఫ్ లో స్లో సీన్స్ తగ్గించాల్సింది. ఇక తెలుగు డబ్బింగ్ డీసెంట్ గా ఉంది. ఇక దర్శకుడు జేపీకి తన మైండ్ లో మంచి ఉద్దేశమే పెట్టుకున్నారు అలాగే హారర్ బ్యాక్ డ్రాప్ లో ఒక సందేశాన్ని చెప్పాలనుకున్నారు కానీ దానిని తెరకెక్కించడంలో మాత్రం ఇంకా జాగ్రత్తలు వహించాల్సింది. ముఖ్యంగా స్క్రీన్ ప్లే పరంగా దృష్టి సారించాల్సింది. ఇక మొత్తంగా చూసుకున్నట్టయితే ఈ 'సు ఫ్రమ్ సో' చిత్రం ఓ రొటీన్ హారర్ కామెడీ సినిమా అని చెప్పాలి. ఒక డీసెంట్ సందేశాన్ని మంచి కామెడీ ఇంకా హారర్ ఎలిమెంట్స్ తో చెప్పాలనుకున్న ప్రయత్నం ఇంకా బెటర్ గా డిజైన్ చేసి ఉంటే బాగుండేది. అక్కడక్కడా కొన్ని కామెడీ సీన్స్, సినిమాలో నాచురల్ సెటప్ ఇంప్రెస్ చేస్తాయి. కానీ ఓవరాల్ ఏదో మిస్ అవుతున్న అసంతృప్తి మాత్రం ఉండిపోతుంది.



## హ్యాపీ బర్త్ డే మహేశ్

సూపర్ స్టార్ మహేశ్ బాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకుంటున్నారు. మహేశ్ బాబు 50వ పుట్టిన రోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకుల శుభాకాంక్షలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి మహేశ్‌బాబుకు బర్త్ డే విషెస్ చెప్పారు. మహేశ్ బాబు నటించిన 'అతడు' సినిమా రీ రిలీజ్ కావడంలో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. తెలుగు సినీ పరిశ్రమకు మహేశ్ హీరో కావడం గర్వకారణమని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. ఏళ్లు గడిచేకొద్దీ యంగ్ కనిపిస్తున్నారని కొనియాడారు. 50వ పుట్టినరోజు శుభాకాంక్షలు అని చిరు తెలిపారు. మహేశ్ ఎన్నో విజయాలను అందుకోవాలని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. #ssmb29 మూవీ ఎప్పుడు విడుదల అవుతుందని ఆసక్తితో ఎదురుచూస్తున్నామని, మహేశ్‌బాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.
మహేశ్‌బాబును ఎవరితోనూ పోల్చలేమని హీరో నారా రోహిత్ తెలిపారు. మహేశ్ నటిస్తున్న #ssmb29 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామన్నారు. నారా రోహిత్ సూపర్ స్టార్ మహేశ్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
50 సంవత్సరాలు
మహేశ్ సూపర్ స్టార్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు
4,500+ ప్రాణాలు కాపాడబడ్డాయి
2 గ్రామాలను దత్తత తీసుకున్నారు
100+ వైద్య శిబిరాలు
51+ స్కాలర్‌షిప్‌లు ప్రదానం

## ఆషికా అందాలు

ఆషికా రంగనాథ్.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హీరోయిన్. చేసింది తక్కువ సినిమాలే అయినా అందం, అభినయంతో కట్టిపడేసింది. అలాగే ఈ అమ్మడి నటనకు మంచి మార్కులు పడ్డాయి. నటించిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ ఆఫర్స్ రావడం లేదు.స్లో అండ్ స్టడీగా సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది ఈ బ్యూటీ. అందరిలా యంగ్ హీరోల పక్కనే కాదు.. సీనియర్ హీరోల సరసన కూడా నటిస్తుంది. నాగార్జున నటించిన నా సామీ రంగ సినిమాలో నటించింది. ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది ఈ వయ్యారి భామ. 1996లో కర్ణాటకలో పుట్టిన ఆషికా.. కన్నడ సినీరంగంలోకి అడుగుపెట్టింది. కాలేజీ రోజుల్లోనే మిస్ ఫ్రెష్ ఫేస్ పోటీల్లో పాల్గొ రన్నరప్ గా నిలిచింది.



## కేటీఆర్ ఢిల్లీ పర్యటన.. కవితతో రాఖీ

# సయోధ్యకు సంకేతమా?

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కుటుంబంలో జరుగుతున్న అంతర్గత విభేదాలు ఇటీవల వార్తల్లో నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) ఢిల్లీ పర్యటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన సోదరి, ఎమ్మెల్సీ కవితతో ఉన్న విభేదాల నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. రాఖీ పండుగ సందర్భంగా కవిత తన సోదరుడికి రాఖీ కట్టడం ద్వారా వీరిద్దరి మధ్య సయోధ్య కుదిరే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. కేటీఆర్ ఇటీవల ఢిల్లీకి వెళ్లి సోమవారం వరకు అక్కడే ఉండనున్నట్లు సమాచారం. ఈ పర్యటన వెనుక రాజకీయ కారణాలతో పాటు కుటుంబ సమస్యలు కూడా ఉన్నాయని ఊహాగానాలు సాగుతున్నాయి. గతంలో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత అరెస్టు కావడం, ఆ సమయంలో కేటీఆర్ ఆమెకు మద్దతుగా నిలవడం వంటి ఘటనలు ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. అయితే, ఈసారి రాఖీ పండుగ సందర్భంగా కేటీఆర్ ఢిల్లీలో ఉండటం వారి మధ్య ఉన్న ఉద్రిక్తతకు సంబంధించిన చర్చలను మరింత రేకెత్తిస్తోంది. రాఖీ పండుగకు కేటీఆర్ ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. గత ఏడాది కవిత తిహార్ జైలులో ఉండటం వల్ల రాఖీ కట్టలేకపోయినప్పటికీ, కేటీఆర్ ఆమెకు మద్దతుగా ఎమోషనల్ పోస్ట్‌లు పెట్టారు. ఈ ఏడాది కవిత బయట ఉన్నప్పటికీ, వారి మధ్య రాజకీయ, వ్యక్తిగత విభేదాలు



రాఖీ సంప్రదాయాన్ని ప్రభావితం చేస్తాయా అన్న సందేహం బీఆర్ఎస్ కార్యకర్తల్లో నెలకొంది. కవిత ఇటీవల ఓ ఇంటర్వ్యూలో "రాజకీయాలు వేరు, బంధుత్వం వేరు" అని పేర్కొనడం ఈ చర్చలకు మరింత ఊతమిచ్చింది. ఒకవైపు కవిత బీఆర్ఎస్‌లో తన ప్రాముఖ్యతను పెంచుకోవడానికి ప్రయత్నిస్తుండగా, కేటీఆర్ పార్టీలో తన నాయకత్వాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటన, రాఖీ సంప్రదాయం వంటివి కేవలం కుటుంబ బంధానికి సంబంధించినవి కాక, రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కవిత ఈసారి కేటీఆర్‌కు రాఖీ కట్టడం ద్వారా వారి మధ్య సయోధ్య కుదిరితే, అది బీఆర్ఎస్‌లో ఐక్యతకు దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## పెళ్లి ఒత్తిడితో యువతి ఆత్మహత్య..

# కరీంనగర్‌లో విషాదం

కరీంనగర్ జిల్లా చొప్పదండిలో విషాదం చోటు చేసుకుంది. జ్యోతినగర్‌కు చెందిన వనపర్తి సంధ్య (27) అనే యువతి, పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేని కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నెల 14న ఆమె వివాహం జరగాల్సి ఉండగా, ఈ సంబంధం పట్ల మనోవేదనకు గురైన సంధ్య, శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ప్రాణాలు తీసుకుంది. సంధ్య కుటుంబం ఈ వివాహానికి సన్నాహాలు చేస్తుండగా, ఆమె మాత్రం ఈ పెళ్లికి ఇష్టం లేకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. సంధ్య కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు సమాచారం. ఆమె తీసుకున్న ఈ ఆత్మహత్య నిర్ణయం కుటుంబ సభ్యులను, స్థానికులను షాక్‌కు గురిచేసింది. సంధ్య తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు చప్పదండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై నరేష్ రెడ్డి వివరాల ప్రకారం, సంధ్య ఈ పెళ్లి విషయంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన సమాజంలో పెళ్లి విషయంలో యువత ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిపై తీవ్ర చర్చకు దారితీసింది. వ్యక్తిగత ఇష్టాఇష్టాలను గౌరవించడం, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించడం యొక్క ప్రాముఖ్యతను ఈ ఘటన గుర్తు చేస్తోంది. సంధ్య కుటుంబం ఈ విషాదం నుంచి కోలుకోవడానికి స్థానికులు, బంధువులు సంఘీభావం తెలియజేస్తున్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# రాజన్న సిరిసిల్లలో యూరియా కోసం రైతుల అర్ధరాత్రి వేచి ఉండకం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వస్థలమైన రుద్రంగి మండలంలో రైతులు యూరియా పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుండి మధ్యాహ్నం నుండే రైతులు కేంద్రానికి చేరుకోవడం ప్రారంభించినప్పటికీ, రాత్రి 10 గంటలు దాటినా వారికి యూరియా కేటాయింపు జరగలేదు. రైతు సేవా కేంద్రంలో యూరియా సరఫరా ఆలస్యం కావడంతో రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు, గంటల తరబడి వేచి ఉండవలసి వచ్చింది. ఈ పరిస్థితి వారిలో నిరాశ మరియు అసంతృప్తిని కలిగించింది. చాలా మంది మహిళా రైతులు, తమ పొలాలకు అవసరమైన ఎరువులు పొందడానికి రాత్రి పొద్దుపోయే వరకు వేచి ఉండక తప్పలేదని వాపోయారు. ఈ ఆలస్యం వల్ల వారి రోజువారీ జీవనంపై తీవ్ర ప్రభావం పడింది. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలు స్థానిక పరిపాలనలో సమన్వయ లోపాన్ని సూచిస్తున్నాయి. యూరియా సరఫరా సమయంలో సమర్థవంతమైన వ్యవస్థ లేకపోవడం, రైతులకు సరైన సమాచారం అందకపోవడం వంటి అంశాలు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేశాయి. రైతు సేవా కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడంతో రైతులు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక రైతులు ఈ సమస్యలపై అధికారుల దృష్టిని ఆకర్షించాలని కోరుతున్నారు. యూరియా సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, సమయానుసారంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవడం వంటివి తక్షణం అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారు.



## తెలంగాణలో మహిళా సాధికారతకు బాట..
# స్వయం సహాయక సంఘాల్లో బాలికల చేరిక

తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత కోసం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్-2025ను రూపొందించింది. ఈ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల్లో కోటి మంది మహిళలను చేర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యంలో భాగంగా, సంఘాల్లో ఇప్పటి వరకు చేరని మహిళలతో పాటు, 15-18 సంవత్సరాల వయస్సు గల బాలికలను కూడా చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ చర్య మహిళలకు ఆర్థిక స్వావలంబన మరియు సామాజిక ఉన్నతిని సాధించే దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమం కింద, స్వయం సహాయక సంఘాల్లో చేరిన మహిళలకు బ్యాంకు లింకేజీలు, CIF రుణాలు, స్త్రీనిధి రుణాలు, సెర్ప్ నుండి రివాల్వింగ్ ఫండ్ వంటి ఆర్థిక సహాయాలు అందించనున్నారు. ఈ ఆర్థిక సహాయాలు మహిళలు సొంత వ్యాపారాలు ప్రారంభించడానికి లేదా ఇతర ఆదాయ వనరులను సృష్టించుకోవడానికి ఉపయోగపడతాయి. ఈ రుణాలు





మరియు సహాయాల ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు, వారి కుటుంబాల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడనున్నాయి. 15-18 ఏళ్ల బాలికలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చడం ఈ కార్యక్రమంలో ఒక వినూత్నమైన అంశం. ఈ యువతులకు ఆర్థిక సాక్షరత, నాయకత్వ లక్షణాలు మరియు వ్యాపార నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని భవిష్యత్‌లో ఆర్థికంగా స్వతంత్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ చర్య యువతుల్లో సామాజిక అవగాహనను పెంచడమే కాకుండా, వారిని సమాజంలో నాయకులుగా తీర్చిదిద్దే దిశగా ఒక ముఖ్యమైన చర్యగా భావిస్తున్నారు. రేవంత్ సర్కార్ ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మరియు పట్టణ మహిళలకు ఆర్థిక స్థిరత్వం మరియు సామాజిక గౌరవాన్ని అందించేందుకు కట్టుబడి ఉంది. ఈ లక్ష్య సాధన కోసం ప్రభుత్వం వివిధ శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుంది. ఈ చర్యలు తెలంగాణలో మహిళల సాధికారతకు ఒక బలమైన పునాదిని వేయనున్నాయని, సమాజంలో మహిళల స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆశిస్తున్నారు.



# అజిత్‌తో శ్రీలీల

బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైన శ్రీలీల, అటు తమిళ్‌లో కూడా గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. శివకార్తికేయన్ 'పరాశక్తి' సినిమాతో తమిళంలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది ఈ చిన్నది. అయితే, ఇప్పుడు మరో స్టార్ హీరో సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేసిందట శ్రీలీల. తమిళ హీరో అజిత్ నెక్స్ట్ సినిమాలో ఆయనతో రొమాన్స్ చేసే పాత్రలో శ్రీలీల నటించబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ డైరెక్ట్ చేయనున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. మరి ఈ సినిమాలో అజిత్‌తో శ్రీలీల రొమాన్స్ ఏ లెవెల్‌లో ఉంటుందో చూడాలి.





# కుప్పకూలిన సైనిక హెలికాప్టర్.. ఇద్దరు ఘనా మంత్రులు మృతి

ఈమధ్య కాలంలో విమాన ప్రమాదాలు చాలా కామన్ అవుతున్నాయి. ఫ్లైట్ యాక్సిడెంట్‌లకు సంబంధించిన వార్తలను తరచుగా వింటూనే ఉన్నాం. మన దేశంలో అయితే కొన్నిరోజుల క్రితం అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదమే అత్యంత తీవ్రమైనది. ఈ ప్రమాదం వల్ల సుమారు 265 మందికి పైగా కన్నుమూశారు. ఇదిలా ఉండగా తాజాగా మరో చోట ఘోర విమాన ప్రమాదం వెలుగు చూసింది. సైనిక హెలికాప్టర్ కుప్ప కూలి ఇద్దరు కేంద్ర మంత్రులు చనిపోయారు. ఈ ప్రమాదం వివరాలు.. ఘనాలో ఘోర ప్రమాదం వెలుగు చూసింది. సైనిక హెలికాప్టర్ కుప్పకూలడం వల్ల ఈ దారుణం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు క్యాబినెట్ మంత్రులతో పాటు మరో ఆరుగురు.. మొత్తంగా ఎనిమిది మంది చనిపోయారు. మృతుల్లో ఘనా దేశ డిఫెన్స్ మినిస్టర్ ఎడ్వర్డ్ ఒమానే బోమాతో పాటుగా ఎన్విరాన్‌మెంట్ మినిస్టర్ ఇబ్రహీం ముర్తాలా ముహమ్మద్ ఉన్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు 6, బుధవారం ఉదయం జెడ్-9 యుటిలిటీ సైనిక హెలికాప్టర్ ఘనా రాజధాని అక్ర నుంచి ఒబువాసికి చేరుకోవడానికి ప్రయాణం మొదలు పెట్టింది. అయితే హెలికాప్టర్ గాల్లోకి టేకాఫ్ అయిన కాసేపటికే అది ఏటీసీతో కమ్యూనికేషన్ కోల్పోయి కుప్ప కూలింది. హెలికాప్టర్ కుప్ప కూలిన సమయంలో దానిలో ఇద్దరు కేబినెట్ మంత్రులతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాద ధాటికి హెలికాప్టర్‌లో ప్రయాణం చేస్తున్న వారంతా చనిపోయారని ఘనా దేశం ప్రకటించింది. ఈ ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే సహాయక బృందాలు ప్రమాదం జరిగిన చోటుకు చేరుకున్నాయి.

# భర్తపై కోపంతో దారుణం.. సజీవ ఖనన యత్నం

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఒక దారుణ సంఘటనలో, భర్తపై కోపంతో రగిలిపోయిన ఓ మహిళ సుపారీ గ్యాంగ్‌తో కలిసి హత్యా పథకం రచించింది. రాజీవ్ అనే వ్యక్తితో వివాహమైన సాధన, వారి దాంపత్య జీవితంలో తలెత్తిన గొడవల కారణంగా ఈ దారుణ నిర్ణయానికి వచ్చింది. భర్తను కిరాతకంగా చంపాలని నిశ్చయించుకున్న ఆమె, అతని కాళ్లు, చేతులు విరగొట్టి, సజీవంగా పాతిపెట్టేందుకు ప్రయత్నించింది. జులై 21న రాజీవ్ ఇంటికి తిరిగి వస్తుండగా, సాధన రచించిన పథకం ప్రకారం సుపారీ గ్యాంగ్ అతనిపై దాడి చేసింది. కిరాతకంగా కొట్టి, అతని కాళ్లు, చేతులు విరగొట్టారు. ఈ దాడి అనంతరం, రాజీవ్‌ను సజీవంగా ఖననం చేసేందుకు గ్యాంగ్ సభ్యులు ప్రయత్నించారు.

# పుతిన్‌తో భేటీ అవుతున్నట్టు ప్రకటించిన ట్రంప్

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో వచ్చే వారం సమావేశం కానున్నట్టు వెల్లడించారు. ఈ చర్చల్లో భాగంగా ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరేలా కొన్ని భూభాగాలను మార్పిడి చేసుకునే అవకాశం ఉందని ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.ఆగస్టు 15న అమెరికాలోని అలాస్కాలో పుతిన్‌తో తాను భేటీ కానున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశం కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ భేటీ తేదీ, ప్రదేశంపై రష్యా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.2022 ఫిబ్రవరిలో రష్యా ప్రారంభించిన దండయాత్ర కారణంగా ఉక్రెయిన్‌లో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. యుద్ధాన్ని ఆపేందుకు గతంలో జరిగిన మూడు విడతల చర్చలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా చొరవ ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ కీలక సమావేశానికి ముందు పుతిన్ మిత్రదేశాలైన చైనా, భారత అధినేతలతో సంప్రదింపులు జరిపారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, భారత ప్రధాని



నరేంద్ర మోదీలతో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని తాము స్వాగతిస్తున్నామని జిన్‌పింగ్ చెప్పినట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, చర్చల్లో తమను కూడా భాగస్వామ్యం చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ డిమాండ్ చేస్తున్నారు. తనతో చర్చలు జరపకుండా శాంతి సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.2021లో జెనీవాలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, పుతిన్ మధ్య సమావేశం జరిగింది. ఆ తర్వాత మళ్లీ ఇరు దేశాల అధ్యక్షులు భేటీ కానుండటం ఇదే ప్రథమం. ఈ చర్చల ద్వారా మూడేళ్లకు పైగా కొనసాగుతున్న భీకర యుద్ధానికి శాంతియుత ముగింపు లభిస్తుందో లేదోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.



# 28 ఏళ్ల తర్వాత వెండితెర రీఎంట్రీ ఇస్తున్న డిస్కో శాంతి

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాలలో ఎనభై, తొంభై దశకాల్లో తన డ్యాన్స్ లు, హుషారైన నటనతో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించిన డిస్కో శాంతి గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. నటిగాను, డ్యాన్సర్‌గాను అప్పట్లో ఉర్రూతలూగించింది. ఇప్పుడు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. దాదాపు 28 ఏళ్ల విరామం తర్వాత ఆమె నటనను మళ్లీ ఆస్వాదించే అవకాశం సినీ అభిమానులకు లభించనుంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'బుల్లెట్' చిత్రంతో డిస్కో శాంతి రీఎంట్రీ ఇవ్వబోతున్నారు. ఈ చిత్రంలో రాఘవ సోదరుడు ఎల్విన్ మరో కీలక పాత్రలో కనిపించనున్నాడు. దర్శకుడు ఇన్నాసి పాండియన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఫైవ్ స్టార్ క్రియేషన్స్ బ్యానర్‌పై కదిరేశన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.శుక్రవారం విడుదలైన టీజర్ ద్వారా డిస్కో శాంతి పాత్రపై కొంత క్లారిటీ రాగా, ఇందులో జోస్యం చెప్పే పాత్రలో ఆమె కనిపించనున్నారు.

# ఇక టోల్ ఛార్జ్ రూ.15లే

దేశంలోని వాహనదారులకు శుభవార్త తెలిపింది కేంద్రం. కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ నిన్న జూన్ 18న ఒక కీలక ప్రకటన చేశారు. వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్ ప్రారంభం గురించి తెలియజేశారు. ఈ కొత్త పాస్ ప్రవేశపెట్టడం వల్ల ప్రైవేట్ వాహనదారులకు చాలా డబ్బు, సమయం ఆదా అవుతుంది. ఈ కొత్త ఫాస్ట్ ట్యాగ్ పాస్ ద్వారా డ్రైవర్లు కేవలం రూ. 15కే టోల్ ప్లాజాను దాటగలరని, ఇది ప్రస్తుత ఖర్చు కంటే చాలా తక్కువ అని గడ్కరీ అన్నారు. వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్ ప్రయోజనాలను వివరిస్తూ నితిన్ గడ్కరీ ఈ పాస్ ధర రూ.3000గా నిర్ణయించినట్లు చెప్పారు. దీనిలో వాహనదారులు 200 ప్రయాణాలు చేయవచ్చని చెప్పారు. ఇక్కడ 'ఒక ప్రయాణం' అంటే ఒక టోల్ ప్లాజాను దాటడం. ఈ లెక్క ప్రకారం.. రూ.3000కి 200 టోల్‌లను దాటడం అంటే టోల్‌కు కేవలం రూ.15 మాత్రమే ఖర్చవుతుందని అన్నారు.

